మృతుని కుటుంబానికి పరిహారం

వైస్సార్ భీమా చెక్‌ను అందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొత్తూరు : మబడలం జోగిపాడు గ్రామానికి చెందిన లుకలాపు హరి ముకుంధరావు కొంతకాలం క్రితం విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో వైస్సార్ భీమా పధకం 5లక్షల రూపాయల చెక్‌ను ఆ కుటుంబానికి మంజూరైంది ఈ చెక్‌ను శనివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మృతుని బార్య లుకలాపు కృష్ణవేణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ చింతాడా సూర్యనారాయణ, వైసీపీ జిల్లా కార్యదర్శి బుర్లే శ్రీనివాసరావు, వైసీపీ నాయుకులు మతం పూర్ణ ,కృష్ణ మోహన తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై వినతి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : నియోజకవర్గ కేంద్రమైన ఇచ్ఛాపురం పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సౌకర్యాల కల్పనతో పాటు ప్రధాన రైళ్ళ నిలుపుదల కోరుతు జెడ్.ఆర్.యు.సి.సి సభ్యులు కట్టా సూర్యప్రకాష్ రైల్వే జి.ఎం. మనోజ్ శర్మను అభ్యర్థించారు. తిరుపతి పూరీ రైలులో జి.ఎం. ప్రయాణ వార్త తెలుసుకున్న ఆయన స్థానిక రైలు నిలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించిన సందర్భంలో డి.ఆర్.ఎం రైలు దిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతళసిద్దేశ్వరాలయానికి వెళ్ళే మార్గంలోని త్రోవను వెడల్పు చేయించాలని, పూరీ-అహ్మదాబాద్, విశాఖపట్టణం-అమృత్‌సర్, పూరీ-యశ్వంత్‌పూర్, పూరీ-చెన్నై రైళ్ళలో ఇక్కడి స్టేషన్‌లో నిలుపుదల చేయించాలని కోరారు. ఆయనతో పాటు దొరబాబు ఉన్నారు.

'చింతాడ'కు ప్రతిష్ఠాత్మక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ అవార్డ్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : సీనియర్ జర్నలిస్ట్ వి.వి.జే. సూర్య ఎడిటర్ చింతాడ అప్పలనాయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డ్‌కు ఎంపికయ్యారు. ప్రముఖ పత్రికలు అయిన వార్త, సాక్షి, ఆంధ్రప్రభ స్పెషల్ కరస్పాండంట్‌గా పత్రికా రంగంలో సేవలు అందించారు. ఆ సమయంలో ఆయన మానవీయ కోణంలో ప్రెజెంట్ చేసిన వార్తలు సమాజాన్ని ద్విగుణీకృతం చేయటంలో ముందుకు సాగాయి.. ప్రస్తుతం స్వంతంగా వి.వి.జే సూర్య పత్రిక సంపాదకులుగాను కొనసాగుతున్నారు. తోటి జర్నలిస్టుల పట్ల స్నేహ పూర్వకంగా ఉంటూ వివాదరహితునిగా పాత్రికేయ రంగంలో తమదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఇదే పంథాలో శ్రీకాకుళం జిల్లా ఏ.పి.యూ.డబ్ల్యూ.జే యూనియన్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. నేడు ఆదివారం ఢిల్లీలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ అవార్డును అందుకోనున్నారు.

జీడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : జీడి రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి జీడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు నాయకులు బి.వాసదేవరావు, బి.ఆనందరావు అన్నారు. శనివారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ జీడిపిక్కల బస్తా ధర గతం కంటే దారుణంగా పడిపోయిందని అన్నారు. 80కేజీల పిక్కలు నుంచి 23 కేజీల పప్పు వస్తుందని, దీనిని మార్కెట్‌లో అమ్మితే రూ.19,500 వస్తుందని, అయితే రైతుల నుంచి 80కేజీల జీడి పిక్కలు 9వేల రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని, రైతును నిలువున దోపిడీ చేస్తున్నారని అన్నారు. తిత్లీ నష్ట పరిహారం కొంతమందికి ఇచ్చి చేతులు ముడుచుకు కూర్చున్నారని, రైతుల పట్ల మొత్తం ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారి, సరైన సమయంలో సరైన గుణపాఠం చెబుతారని అన్నారు. వారితో పాటు అప్పయ్య, పాపయ్య, నేతాజీలు ఉన్నారు.

కేంద్ర పథకాల కోసం గ్రామస్థాయిలో ప్రచారం

విశాలాంధ్ర-జలుమూరు: కేంద్రం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల కోసం గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత బిజెపి నాయకులపై ఉందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి అన్నారు. శనివారం జలుమూరు మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి పాలనలో ఎంతో ప్రగతిని సాధించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జలుమూరు మండల నాయకులు నారాయణమూర్తి ఉన్నారు.

జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన జగదీష్

సెమ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల అరుదైన స్థానం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తంగి జగదీష్ సెమ్స్ ఒలింపియాడ్ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మూడవ ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు తెలిపారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం స్వచ్ఛంద సంస్థ వారిచే నిర్వహించిన సెమ్స్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్ మార్చి నెలలో నిర్వహించారని, ఈ టాలెంట్ టెస్ట్ లో ప్రాథమిక స్థాయిలో ర్యాంక్ సాధించగా, జాతీయస్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన జగదీష్‌కు ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు ఆనందరావు, రమణమూర్తితోపాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు, సిబ్బంది అభినందించారు.

ఫోటో రైట్ అప్ జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన విద్యార్థి.

భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతి

విశాలాంధ్ర-పాతపట్నం : మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పాతపట్నం మెయిన్‌లో ప్రధానోపాధ్యాయులు బట్ట రవి అధ్యక్షతన, పాతపట్నంకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో జవహర్లాల్ నెహ్రూ 59వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఉపాధ్యాయులు శిష్టు షణ్ముఖరావు పాల్గొన్నారు. షణ్ముఖరావు మాట్లాడుతూ నెహ్రూ స్వాతంత్ర్య సమరయోధునిగా, భారతదేశ మొదటి ప్రధానిగా, రచయితగా, పండితులుగా, పంచవర్ష ప్రణాళికలు రూపకర్తగా, పంచ- శీల సూత్రాలు రూపకర్తగా భారతదేశానికి ఎంతో సేవ చేశారని, భారతదేశాన్ని వ్యవసాయకంగా, పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలలో భారతదేశ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.ఈశ్వరమ్మ, బి.తిరుపతిరావు, ఏ.సత్యనారాయణ, ఎం.సవరయ్య, పి.స్వప్న, బి.లత, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు

ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి వినతి

విశాలాంధ్ర-మందస : బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని, ఆదివాసీలకు అండగా ఉండాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరిక ప్రపంచానికి, అభివృద్ధికి దూరంగా ఆదివాసీలు జీవిస్తున్నారని, నేటికి ఆదివాసీలు నివశిస్తున్న గ్రామాలకు సరైన రహదారి, వైద్య విద్య సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న 6శాతం రిజర్వేషన్లు ఆంధ్రప్రదేశ్‌లో జీవిస్తున్న 30 లక్షల ఆదివాసీలకు పూర్తిస్థాయిలో అందడం లేదని అన్నారు. వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సి.ఎ.పి.ఎస్.ఎస్ జాతీయ అధ్యక్షులు జెర్రిపోతుల పరుశురాం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు డి.మోహన్, టి.తవిటినాయుడు, జె.నాగేశ్వరరావు, ఎస్.దండాసిలు ఉన్నారు.

క్రీడలు భారతదేశ సంస్కృతిలో భాగం

రూ. 2 లక్షలు విలువైన కిట్లు పంపిణీ చేసిన కృష్ణదాస్

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: క్రీడలు భారత దేశ సంస్కృతిలో భాగమని, వాటి అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేకమైన కృషి చేస్తున్నదని రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. క్రీడలను జీవనోపాధి మార్గంగా ఎంచుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన వాతావరణాన్ని నిర్మించాలని ఆయన సూచించారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్న సందర్భంగా కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడాకారులకు ప్రత్యేక స్పోర్ట్స్ కిట్లను శనివారం సాయంత్రం ఆయన అందజేశారు. జిల్లాలో మొత్తం 50 చోట్ల వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపుగా 2000 మంది పలు క్రీడాంశాలలో అంతర్జాతీయ స్థాయి తర్ఫీదు పొందుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా సుమారు రూ. రెండు లక్షలు విలువ చేసే కిట్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో తమ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ఎన్నడూ లేనంతగా కట్టుబడి ఉందని కృష్ణ దాస్ వివరించారు. సీఈవో ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ శ్రీధర్, ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి సుందర్రావు, కార్యదర్శి సాంబమూర్తి, పీఈటీల అసోసియేషన్ నుంచి పోలి నాయుడు, పలువురు కోచ్ లు మాధురి, మణికంఠ, ఉమా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్నాను... ఆశీర్వదించండి

మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస: 60 ఏళ్ల గౌతు కుటుంబ పాలనలో లేనటువంటి అభివృద్ధిని కేవలం నాలుగేళ్లల్లో చేసిన చూపిస్తున్నానని, ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డు లేబరుకాలనీ, శివాజీనగర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి డా.సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దాన కిడ్నీ రోగుల స్వాంతన కోసం 200 పడకల సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 16 కోట్ల రూపాయలతో వజ్రపుకొత్తూరు వయా అక్కుపల్లి - కాశీబుగ్గ రోడ్డు విస్తర్ణ పనులు మరో రెండు నెలల్లో పూర్తి కావస్తుందని, త్వరలో ప్రజలకు అంకితం చేస్తామన్నారు. పలాస రైల్వే ప్లై ఓవరు వంతెన నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పలాస మున్సిపాలిటీ కె.టి రోడ్డు పనులు జరుగుతున్నాయని అన్నారు. మందస రహదారి విస్తర్ణ పనులు పూర్తి చేశామని, గిరిజన ప్రాంత మారుమూల గ్రామాలన్నీ కలుపుతూ బి.టి రహదారులు నిర్మించామన్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు శాయశక్తు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా ప్రత్యేక చొరవ చూపడం వలన ఇవన్నీ సాధ్యమయ్యాయని, అసంపూర్తిగా ఉన్న పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికి వాలంటీర్ల వ్యవస్థ ద్వారా వారి దరికి చేరుస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా తిరిగి జగన్మోహనరెడ్డి అయ్యేందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి, వైసీపీ నాయకులు అంబటి ఆనందరావు, హనుమంతు రామ్మోహనదొర, నెయ్యిల భగీరథి, కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌లు పాల్గొన్నారు.

వైస్సార్ కంటివెలుగులో శ్రీకాకుళం జిల్లా ఫస్ట్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: అంధత్వ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వైస్సార్ కంటివెలుగు ప్రోగ్రామ్ అమల్లో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలో దండివీధి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వైస్సార్ కంటివెలుగు ప్రోగ్రామ్ పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో 60ఏళ్ళు దాటిన 2.94 లక్షల మందిని గుర్తించి వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటిచికిత్సలు జరుపుతున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 12వేల మందికి శస్త్ర చికిత్సలు జరిపామని మరో 8వేలమందికి త్వరలో శస్త్ర చికిత్సలు జరుపుతామన్నారు. .శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 23 వైద్య బృందాలు కంటి వెలుగు పై సర్వే జరుపుతున్నాయని అన్నారు.స్వంచ్ఛంద సంస్థలు సహకారాన్ని తీసికొని శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 83 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అంధత్వంతో బాధపడే వారికి కావాల్సిన కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ మరియు మందులు అందజేస్తున్నామని అన్నారు. అంధత్వంతో బాధపడే వారు ఒక్కరు కూడా ఉండకూడదనే ప్రధాన లక్ష్యంతో ఈ ప్రోగ్రాం పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు..స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ లో కూడా శ్రీకాకుళం జిల్లా అగ్రభాగాన్న ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ కలిశెట్టి త్రినాథరావు, అప్తాలమిక్ అధికార్లు రాజారెడ్డి,బాబూరావు, దండివీధి వార్డు ఇంఛార్జి కర్ణేన హరి,సచివాలయం సిబ్బంది,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి చూపుతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించారు.

మహానాడు సభాస్థలిలో కలమట

విశాలాంధ్ర-కొత్తూరు : రాజమహేంద్రవరం తెలుగుదేశం మహానాడు సభలో తొలి రోజున పాతపట్నం నియోజకవర్గ ఆ పార్టీ ఇంఛార్జి, మాజి ఎమ్మెల్యే కలమట వేంకట రమణ మూర్తి పాల్గొన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజికవర్గం టీడీపీ అధ్యక్షులు కూనా రవికుమార్‌తో పాటు పలువురు నియోకవర్గ పార్టీ ఇంఛార్జిల సరసన మాజీ ఎమ్మెల్యే కలమట ఆశీనులైనారు. తన పాతపట్నం నియోజకవర్గం నుండి మహానాడుకు భారీగా పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరైనారు. ఈ సభలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేసిన ప్రసంగం, ఇతర ముఖ్యులు చేసిన ప్రసంగాలు ఎంతో ఉత్తేజాకారంగా ఉన్నాయని మాజి ఎమ్మెల్యే కలమాట ఇక్కడ శనివారం రాత్రి మీడియా ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడుతూ అన్నారు.

మహానాడు వేదికపై ఎంజీఆర్

విశాలాంధ్ర-పాతపట్నం : తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నటువంటి మహానాడు లో మొదటి రోజు కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, అన్న నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలు మహానాడు లో జరుపుకోవడం ప్రాధాన్యతను సంతరించుకోవడంతో ఈ మహానాడు కార్యక్రమానికి పాతపట్నం నియోజకవర్గం నుంచి భారీగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలసి పాల్గొన్నారు. అయితే వేదికపైన లోకేష్ బాబుతో ఎంజీఆర్ మాటామంతి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఏపీ పీఈసెట్ ఎగ్జామినర్‌గా వీఆర్‌ఏయు ఎ.డి.

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు) ఆవరణలో ఈనెల 31 నుంచి జూన్ రెండవ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీ పీఈ సెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు నియమితులయ్యారు. వర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ఏ రాజేంద్రప్రసాద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బీపీఈడి, యుజిడి, పిఈటి కోర్సులో ప్రవేశానికి నిర్వహించనున్న ఈవెంట్స్‌కు తనను ఎగ్జామినర్‌గా నియమించ దంపట్ల కృతజ్ఞతలు తెలిపారు.

నెహ్రూ వర్ధంతి

విశాలాంధ్ర-రణస్థలం: భారతదేశ మొదటి ప్రధాని భారతరత్న స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్చార్జి, రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో రణస్థలం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ కె.లక్ష్మి, కె.జోగినాయుడు, ఎ.జగదీష్ నాయుడు,వై. సూర్యనారాయణ, ఎం.గణేష్, రాజు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి నూతన గృహాన్ని జనసైనికులు కానుకగా అందజేత

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం డోకులపాడు గ్రామానికి చెందిన లండ నారాయణమ్మకు పక్షవాతం రావడంతో కాలు చేతులు పనిచేయకపోవడంతో ఎక్కడ కదలకుండా కష్టంగా జీవనం సాగిస్తోంది. నివసించేందుకు సరైన ఇల్లు లేకపోవడం కూడా చాలా బాధకు గురి చేసింది. ఈ బాధను చూసిన గ్రామానికి చెందిన జనసేన సభ్యులు సుమారు రూ. 65000 స్వంత నిధులు ఖర్చు పెట్టి నూతన గృహాన్ని నిర్మించి అంబికా దేవి గ్రామ సంబరాలకు ఆమెకు కానుకగా అందచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసైనికులు అంబటి ధనరాజు, కర్రి ఉమా శంకర్, చిరంజీవి, శ్రీను, బాలకృష్ణ, వీర మహిళలకు పుష్ప, రాజేశ్వరి పాల్గొన్నారు.

నైతిక విలువలు ఎంతో అవసరం

విశాలాంధ్ర-సోంపేట : సామాజిక అభివృద్ధికి అత్యంత విలువైన నైతిక విలువలను కాపాడుకోవల్సిన, పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ మండలం మామిడిపల్లి గ్రామంలో రెండు వారాలుగా స్థానిక మహాత్మా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వ్యక్తిగత అభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించారు. బెనారస్ హిందూ యూనివ ర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణదాస్ ఈ కార్యక్రమంలో ముఖ్య శిక్షకుడిగా వ్యవహరించి యువతకు నైతిక విలువలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమం బొడ్డు సింహాచలం అధ్యక్షతన శనివారం ఆ గ్రామంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ పాతిన కృష్ణమూర్తి, సర్పంచ్ శేషగిరి తదితరులు మాట్లాడుతూ నైతిక విలువలు కోల్పోవడం ద్వారా వ్యక్తుల్లో పరివర్తన కోల్పోయి, సంస్కారం కోల్పోయి, యువత తప్పుదోవ పడుతుందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల వల్ల సమాజం గొప్పదనాన్ని కోల్పోతుందని అందుకు సమస్యలకు నిలయంగా మారుతుందని అన్నారు. ఈ సందర్భంగా తరగతుల శిక్షకుడు ప్రొఫెసర్ బాలకృష్ణదాస్‌ను గ్రామస్తులంతా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కామరాజు, లోకనాధం, నాగేశ్వరరావు, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా పోలీసుశాఖలో విధులు నిర్వహించి మరణించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ మహా దేవన్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ జి ఆర్ రాధిక పేర్కొన్నారు. కవిటి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తు అనారోగ్యంతో మరణించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ డి.వి భాస్కరరావు,పోలకి పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వి మహదేవన్ కుటుంభా సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నగదు చెక్కులును శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. ఈ మేరకు ఏఎస్ఐ సతీమణి ధనలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ సతీమణి దయమని నకు ఆడిషినల్ కార్పసు ఫండ్ రూపంలో ఒకొక్కరికి ఒక లక్ష రూపాయల నగదు చెక్కులను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం, పిల్లలు చదువు తదితర అంశాలపై చర్చించి, మీకు మీ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళల అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.వారి కుటుంబాలకు రావాల్సిన మిగిలిన ప్రయోజనలు సకాలంలో అందేటట్లు, చర్యలు తీసుకోవాలని కార్యాలయం సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి శివా రామ రాజు ఉన్నారు.

ప్రాణాన్ని కాపాడిన బోరుభద్ర యువకుడు

- విజయవాడ రైల్వేస్టేషన్లో జరిగిన సంఘటన - స్వగ్రామంలో హర్షాతిరేకాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన యువకుడు, సిఆర్‌పిఎఫ్ జవాన్ బాలక ఈశ్వరరావు ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన సంఘటన పట్ల స్వగ్రామం అయిన బోరుభద్రలో హర్షాతిరేకాలు వెల్లువెత్తు తున్నాయి. వారి స్నేహితులు ద్వారా తెలిసిన వివరాలు ప్రకారం శనివారం విజయవాడ రైల్వే స్టేషన్ లో ఒక వ్యక్తి విద్యుత్ షాక్ గురై నేలకూలిపోయారు. అక్కడున్న వారు అతను గుండె ఆగిపోయిందని, ఎవరు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. అటువంటి స్థితిలో ప్రజలు ఏ కష్టాల్లో ఉన్న మేమున్నము అనే ఆలోచన ఉన్న సంతబొమ్మాళీ మండలం బోరుభద్ర గ్రామ గ్రామానికి చెందిన యువకుడు ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తున్న బాలక ఈశ్వరరావు తన గుండె పై బాది భౌతిక చికిత్స అందించి అతనికి రక్త సరఫరా జరిగేటట్లు చేసాడు. తరువాత అతని గుండె పనిచేయడం జరిగింది. తమ ఇంటిలో ఒక ప్రాణాన్ని నిలబెట్టిన బోరుభద్ర గ్రామ యువకుడు ఈశ్వరరావు ని బాధిత కుటుంబ సభ్యులు అభినందించారు. అతని ధైర్యానికి బోరుభద్ర గ్రామ యువకులు ఉద్యోగులు గ్రామస్తులు అభినందించారు. ఈశ్వరరావు మాట్లాడుతూ, దేశ రక్షణ నాకు ఆర్మీ నేర్పిందని, ప్రజల ప్రాణాలు రక్షణ మా గ్రామం నేర్పిందని తెలిపారు.

మహానాడుతో నూతనోత్తేజం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలు నేటికీ అందిస్తుందని, నేటికీ ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల తర్వాత చేపట్టిన పార్టీ మహానాడు కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, 22, 3వార్డుల కౌన్సిలర్లు కాళ్ళ దిలీప్, పత్రి తవిటయ్య, పట్టణ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిన క్రిష్ణయ్య, బాలక్రిష్ణాపురంకు చెందిన నాయకుడు బోరుబద్ర లోహిదాసు తదితరులు పాల్గొన్నారు. మహానాడులో సీనియర్ నాయకులను కలిసి తమ అనుభవాలను తెలుసుకుని వారి సూచనలు అందుకున్నామని, భవిష్యత్‌లో మున్సిపాలిటీ, నియోజకవర్గ పరిధిలో తిరుగులేని రీతిలో పార్టీ జెండాను ఎగురవేసే నూతనోత్తేజం కల్గిందని ఈ సందర్భంగా వారు అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారని, తామంతా మహానాడు స్ఫూర్తిగా మరింత ఉత్సాహంగా పార్టీ ఉన్నతికి పాటుపడతామని తెలిపారు.

కవిటిలో : ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా రాజమహేంద్రవరంలోని చేపడుతున్న మహానాడు కార్యక్రమానికి టీడీపీ కవిటి మండల నాయకులు పొందల కృష్ణారావు, బార్ల చిన్నబాబు,తమరాల హరినాథ్,బోసుదేవ్ ప్రదాన్ తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం పాల్గొన్నారు. ఈనెల 27, 28 తేదీలలో రెండు రోజులపాటు జరిగే మహానాడు కార్యక్రమానికి అధిక సంఖ్యలో కవిటి మండల నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఎచ్చెర్ల : రాజమండ్రిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో ఎచ్చెర్ల మండలానికి చెందిన తెలుగు తమ్ముళ్లు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బెండు మల్లేశ్వరరావు, వావిలిపల్లి రామకృష్ణ, పైడి ముఖ లింగం, గాలి వెంకటరెడ్డి, గూరు జగపతిబాబు, కొత్తకోట అమ్మి నాయుడు, అల్లుపల్లి రాంబాబు, నక్క లక్ష్మణరావు, గట్టెం శివరాం, గాడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు జేవీకే కిట్లు

విశాలాంధ్ర -పొందూరు: విద్యార్థులకు జూన్ 12కి పాఠశాలలు తెరిచేలోపు జేవీకే కిట్లు అందించేందుకు అన్ని ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని ఎస్ఎస్ఏ ఏఎంవో సీహెచ్ సుధాకరరావు, ఏఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పూడి తిరుపతిరావు చెప్పారు. మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జేవికే స్టాక్పాయింట్ వద్ద జేవీకే కిట్ల ఏర్పాట్లను పరిశీలించా రు. ఏల్లాలో 1 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న 33,173 బాలురు. 38,223 మంది బాలికలకు స్కూల్బ్యాగులు యూనిఫారంలు, 1 నుంచి 10 వ తరగతి వరకు ఉన్న బాలురకు బెల్టులు, 1 నుంచి 5 వ తరగతి వరకు చదువుతున్న 41.453 మంది బాలికల కు బెల్టులు, 32818 మంది బాలురకు, 38.170 మంది బాలికలకు కొలతలు వారీగా 2042 మంది 4వ తరగతి విద్యార్థులకు ఆక్స్ఫర్డ్ నిఘంటువులు, 13,322 మంది 1 వ తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ నిఘంటువులు, జిల్లాల్లో విద్యార్థులందరికీ 11 లక్షల 165 వేల 16 నోట్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. జేవీకే కిట్ల తయారీ ఏర్పాట్లను వేగవంతం చేయడం జరిందన్నారు. కిట్ల ఏర్పాట్లలో పొందూరు జేవీకే-4 సభ్య లు పనితీరును కిట్ల తయారీలో జాప్యంలేకుండా పర్యవేక్షిస్తున్న ఎంఈవో రామరాజు, స్టాక్పాయింట్ ఇన్చార్జిని పద్మావతిని అభినందించారు.

'ప్రతినిధులకు వేదన చెబుదాం'లో రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఏపిజెఏసి అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించే మూడవ దశ ఉద్యమ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా "ప్రజాప్రతినిధులకు ఉద్యోగుల వేదనను చేబుదాం" కార్యక్రమం ద్వారా శ్రీకాకుళం జిల్లా ఆమదాల వలస నియోజకవర్గ శాసనసభ్యులు మరియు శాసన సభాపతి తమ్మినేని సీతారాం కి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం క్యాంపు కార్యాలయంలో అందించారు. సమస్యలపై సాను కూలంగా స్పందించారు. ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. పిఆర్సి ఏరియర్స్ తోపాటు నాలుగు డి ఎ ఎరియర్స్ చెల్లించాలని వినతి పత్రంలో వివరించారు. అన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, శ్రీరాము లు చైర్మన్ అండ్ ఎస్ వీ రమణ సెక్రటరీ జనరల్ ఏపిజెఏసి అమరావతి శ్రీకాకుళం జిల్లా సభ్యుల ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులు సమస్యలను తమ్మినేని సీతారామకు వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని డిమాండ్ లో పొందు పరిచారు. పెండింగ్ లో ఉన్న మూడు కొత్త డిఏలను అందించి, సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రధానంగా ఆ డిమాండ్ లో పేర్కొన్నారు. జేఏసీతో పాటు ఆముదా లవలస తాసిల్దార్ గణపతి రావు, సి ఎస్ డి టి అమర్నాథ్ రెవిన్యూ మునిసిపల్ పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటికే అన్నారు.... వీధుల్లో ఇస్తున్నారు

- గాడితప్పిన రేషన్ సరకుల సరఫరా...
- లబ్ధిదారుల అవస్థలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రేషన్ లబ్ధిదారుల సౌకర్యార్థం ఇంటి వద్దకే సరకులు సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. క్షేత్రస్థాయిలో మాత్రం సరిగా అమలు కావడం లేదు. రేషన్ సరకులతో వాహనాలు ఇంటింటికీ రావడం లేదు. వీధి చివర వాహనం ఆగితే అక్కడకు లబ్ధిదారులు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. దివ్యాంగులకు సైతం ఈ విషయంలో ఎలాంటి మినహాయింపు లేదు. రూ. కోట్లు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసి, రూ. వేలల్లో జీతాలిస్తున్నా ఫలితాలు అంతం మాత్రంగానే మిగిలాయి. మొదటిల్లో గ్రామ వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు వచ్చిన సరుకులు ఇంటింటికి తెచ్చి ఇచ్చేవారు. తరువాత వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఈ వాహనం వచ్చినా వీధిల్లో ఎక్కడో ఒక చోట ఉంచి అక్కడకు రావాలంటులన్నారు. తీరా వెళితే ఒక్కో సారి సాంకేతిక కారణాలతో గంటల సేపు సమయం వృదా అవుతోంది.

నెలకు 15 రోజులే... నెలకు 15 రోజులు మాత్రమే వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తారు. ఒకటో తేదీ నుంచి 17 లోపు సరఫరా చేయాలనే నిబంధనలున్నాయి. మిగిలిన 15 రోజులు వాహనాలకు పని ఉండదు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసే ఆపరేషర్లకు ప్రతి నెలా ప్రభుత్వం రూ. 18వేలు ఇస్తోంది. వాహనం బయటకొస్తే రోజుకు రూ. వెయ్యి వంతున వేతనం ఉంటుంది. రోజుకు 5 నుంచి 10 కిటోమీటర్లు వంతున నాలుగైదు వీధులు వాహనం ప్రయాణిస్తుంది. ఒక వీధి చివరలో వాహనం ఆపితే అక్కడ ఉన్న లబ్ధిదారులంతా అక్కడకు వెళ్ళి సరుకులు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

వాహనం ఎక్కడ ఉంటే అక్కడే...: ఇంటికే సరుకులు (డోర్ డెలవరీ) అంటే సంతోషించాం. కానీ అదే వాహనం డోర్ వద్దకు వెళ్ళి సరకులు తెచ్చుకోవడం అని కొన్ని రోజులు తరువాత తెలిసింది. వాహనం ఎక్కడ ఉంటే అక్కడకు పరుగులు పెడుతున్నాం. వాహనం ఎప్పుడొస్తుందో తెలియక పనులు మానుకోవాల్సి వస్తోంది.

-పద్మావతి, లబ్ధిదారురాలు, కోటబొమ్మాళి.

ప్రతి ఇంటి వాహనం వెళ్ళేలా చూస్తాం: కార్డుదారులందరికీ ఇంటి వద్దకే సరకులు అందేలా చర్యలు చేపడతాం. ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి వీధి, ప్రతి ఇంటి వద్దకు వాహనం వెళ్ళాల్సిందే. ఇంటి వద్దనే సరకులందలేదని పిర్యాదులొస్తే సంబందిత ఆపరేటర్లపై తగిన చర్యలు తీసుకుంటాం.

- రాము, సీఎస్‌డీటీ, కోటబొమ్మాళి.

పగిలిన రోళ్ళు... రోహిణి కార్తెకు ఆనవాళ్లు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: పగిలిన రోళ్లను చూస్తే రోహిణి కార్తెకు ఆనవాళ్లుగా గుర్తించడం అలవాటు. ప్రాచీన కాలము నుంచి కూడా రోహిణి కార్తెలో రోళ్ళు పగులుతాయన్న కథ ఇప్పటికీ నడుస్తోంది. జ్యోతి చక్రంలో ఉన్న 27 నక్షత్రాలను తెలుగు ప్రజలు కార్తెలు అని పిలుస్తారు. వీటిలో వేసవిలో చివరిగా వచ్చే కార్తెను రోహిణీ కార్తె అంటారు. ప్రస్తుతం ఈ రోహిణి కార్తె గురువారం ప్రారంభమైంది. రోహిణి కార్తె వచ్చింది అంటే ఎండలు మరింత పెరుగుతాయి. రోహిణి కార్తెలో రోళ్ళ పగిలే విధంగా ఎండలు దంచేస్తాయనేది మనకు తెలుస్తుంది. ఈ నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తొలి రోజులలో కొద్దికొద్దిగా పెరిగి ఉగాది నుండి వేడి తాపం ఎక్కువ అవుతుంది. దినదిన ప్రవర్తమానంగా సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని మనకు చూపిస్తాడు ఎండాకాలంలో చివరికార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి ఈ ఏడాది గురువారం ప్రవేశించిన రోహిణి కార్తె జూన్ 8వ తేదీన ముగియనుంది. ఈ పక్షం రోజులపాటు అధిక వేడి, వడగాల్పులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు కార్తెల ఆధారంగా వ్యవసాయం కూడా సాగిస్తారు. అశ్విని కార్తె వస్తే అడుగు కూడా తడవదని, భరణి కార్తె వస్తే బండలు బద్దలవుతాయని, మృగశిర వస్తే ముసలియెద్దు రంకెలు వేస్తుందని ఆరుద్ర అంటే ఆదాయాలబాన అని, స్వాతి కార్త్యలో షర్టు బండలు కూడా మొలకెత్తుతాయని, రోహిణి పగిలిన రోళు ఎండలకు రోళ్ళ పగులుతాయని పెద్దలు చెబుతున్నారు. వ్యవసాయ సీజన్లో వర్షాలు రాని పక్షంలో ఉత్తర చూసి ఎత్తర గంప అంటే హస్తకార్తెను చూసి చూసి అందరం వెళ్లాం అనే సామెత ఇప్పటికీ వినవస్తోంది. జ్యోతి శాస్త్ర ప్రకారం 27 నక్షత్రాల ఆధారంగా పంచాంగాలు జాతకాలు క్యాలెండర్లు తయారు చేస్తారు. సూర్యోదయ సమయానికి ఏ నక్షత్రం చంద్రునికి దగ్గరగా ఉంటే ఆ నక్షత్రం పేరు పెడతారు. తెలుగు ప్రజలు మాత్రం ఈ నక్షత్రాలను కార్తెలు అని పిలుస్తారు. మనం చంద్రుని ప్రకారం సూర్యమానం ప్రకారం సూర్యుడు ఏ నక్షత్రా నికి దగ్గర ఉంటారో ఆ నక్షత్రం కార్తెగా పిలుస్తారు. మొత్తం మీద ప్రాచీన కాలం నుంచి వస్తున్న కార్తెలు వ్యవసాయం, పండుగలు, సంస్కృతి సంప్రదాయాలు తదితర వాటిని నేటికీ గుర్తు చేస్తున్నాయని చెప్పడంలో సందేహం లేదు.

వాలంటీర్లు సేవలు నిరుపమానవైనవి

- సీఎం జగన్మోహన్ రెడ్డి ఆశయ రథసారధులు
- అర్హత గల ప్రతీ ఒక్కరికి పథకాలు అందివ్వాలి
- వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో సభాపతి తమ్మినేని

విశాలాంధ్ర-బూర్జ: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన సచివాలయ వాలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం బూర్జ మండలం కొల్లివలస గ్రామంలో వాలంటీర్లకు వందనం కార్య క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులుతో కలసి సభాపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఉత్తమ వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది సత్కరిస్తోందన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా వాలంటీర్ల వ్యవస్థ పనిచేయా లని సూచించారు. గ్రామ,వార్డ్ వాలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వాల న్నారు. ఇంటింటి సర్వే, పెన్షన్ల పంపిణీ, యాప్ ల వినియోగం,నవరత్నాల అమలులో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ, పెన్షన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు,రేషన్ కార్డు మంజూ రులలో వాలంటీర్ల సేవలు అభినంద నీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలుతో వాలంటీర్లు స్ఫూర్తిగా పనిచేయాలని తమ్మినేని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వాలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలును అర్హు లందరికీ అందించి ప్రజలకు మరింత దగ్గర కావాలని వాలంటీర్లకు సూచించారు. సేవా వజ్ర, రత్న అవార్డులు రానివారు నిరుత్సాహం పడొద్దన్నారు. వాలంటీర్లకు తాను కుటుంబ సభ్యుడు వలే తోడుగా ఉంటానని స్పీకర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వాలంటీర్లుకు మంచి భవిష్యత్తు ఉంటుంద న్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలును ప్రజలకు అందించి ప్రజల మన్ననలను పొందాలన్నారు.ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరువ చేయడంలో వాలంటీర్ లు కృషి ఎంతో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటి వద్దకే పెన్షన్ కార్యక్రమం ప్రతి నెల 1వ తేదీన సూర్యుడు ఉదయించక ముందే పెన్షన్ పంపిణీ చేస్తు న్నారన్నారు. విపక్షకు చోటు లేకుండా ప్రభు త్వ సంక్షేమ పథకాలను అర్హులను గుర్తించి పథకాలు అందేలా పాటు పడుతు న్నార న్నారు.ప్రజల కు మంచి చేస్తున్న ప్రభుత్వం పై తప్పుదు విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల గురించి ప్రజలకు నిజాలు చెప్పగల సత్య సారధులు వాలంటీర్లు అన్నారు. ఈసందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వ హిస్తున్నామని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.ప్రజల చిరునవ్వులు, ఆశీర్వాదాలే మాకు కొండంత బలం అన్నారు. జగనన్న సైనికులుగా ఉన్నందుకు గర్విస్తున్నాం అని వాలంటీర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగు ఎంపీపీ ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు జడ్పిటిసి బ్రిడ్జ్ కొరకు రామారావు మండల పార్టీ అధ్యక్షులు కిట్కో డైరెక్టర్ కన్నా గోవిందరావు వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు కరణం కృష్ణమనాయుడు బిసిఐఎస్ అధ్యక్షులు మగాది నారాయణ మూర్తి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు మండల వైయస్సార్ కార్యదర్శి ఇసాయి వెంకట్రావు వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అదికారులు పాల్గొన్నారు.

భూమి, భుక్తి విముక్తి కోసమే పోరాటాలు జరిగాయి

ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ

విశాలాంధ్ర-పలాస: భూమి భుక్తి, విముక్తి కోసమే పోరాటాలు జరిగాయని విరసం అధ్యక్షులు అరసవల్లి కృష్ణ అన్నారు. శనివారం బొడ్డపాడు అమరవీరుల భవనంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ జరిగిది. ముందుగా అమరుల పతాకాన్ని దివంగత సుబ్బారావు పాణిగ్రాహి సహచరి సురేఖ పాణిగ్రాహి ఆవిష్కరించారు. అమరుల బంధు మిత్రుల సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు జోగి కోదండం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటం దేశంలోనే ప్రాముఖ్యం సంతరించుకుందని, ఈ పోరాటం ద్వారానే దేశంలో అనేక సంస్కరణలు వచ్చాయని, భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరత్వం చెందారని అన్నారు. భారత దేశంలో నూతన పార్లమెంటు భవనం ప్రారంభానికి ఆదివాసీ మహిళా రాష్ట్రపతికి ఆహ్వానం లేదంటే పాలకులు ఆదివాసీ, దళిత, మత మైనార్టీల వ్యతిరేక పాలన సాగుతోందన్నారు. ప్రస్తుత భారత రాష్ట్రపతి చేత పార్లమెంటు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే దాసరి శ్రీరాములు మాట్లాడుతూ శ్రీకాకుళం అమరుల త్యాగమే దేశంలో మావో ఇజానికి ప్రేరణ అని, దేశంలో ఆకలి, అంటరానితనం, ఉన్నంత కాలం మావోయిజం సజీవంగా ఉంటుందన్నారు. సమావేశంలో తామడ త్రిలోచన, ప్రగతి శీల కార్మిక స ంఘం నాయకులు పి.దుర్యోదన, శేషయ్య, మోహిని, ధనలక్ష్మీ, లత, బొడ్డు, సింహాద్రి, కారి పురుషోత్తం, గుణవంతు, ఎం.గణపతి, గంగయ్యలు పాల్గొన్నారు.

గ్రామ వాలంటరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-కవిటి: మండలంలో వివిధ గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న 6 గ్రామ వాలంటీర్ పోస్టుల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడీఓ పి.సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బోరివంక క్లస్టర్ 10లో మహిళ (ఎస్సీ) కేటగిరీకి1, బైరిపురం క్లస్టర్ 1లో జనరల్(ఆల్) క్యాటగిరికి1,కవిటి క్లస్టర్ 19 పరిధిలో బీసీ(ఆల్) కేటగిరీకి1,కొజ్జిరియా క్లస్టర్ 7 లో జనరల్ (ఆల్) క్యాటగిరి 1,బెలగాం క్లస్టర్ 1 పరిధిలో జనరల్(ఆల్) క్యాటగిరి1, రాజపురం క్లస్టర్7 జనరల్ (ఆల్) కేటగిరీ1 ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ పోస్టుల భర్తీకి ఈ నెల 27వ తేదీ నుండి 29 వ తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈనెల 30 వ తేదీన దరఖాస్తులు పరిశీలించి, ఈనెల 30 వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి,ఈనెల 31వ తేదీన ఎంపిక కాబడిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.ఎంపిక కాబడిన వాలంటీర్లు జూన్ 1 వ తేదీ న విధుల్లో చేరవలసి ఉంటుందని తెలిపారు.

వాలంటీర్లు నిస్వార్ధ సేవకులు



విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రవేశ పెట్టిన వాలంటీర్ల వ్యవస్థలో వాలంటీర్లు చేస్తున్న సేవలు వెల కట్టలేనివని, వారు నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని పలాస లకాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శనివారం 22, 23 వార్డుల పరిధిలో బత్తులవీధి సచివాలయంలో వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 50 ఇళ్లకు నియమించిన వాలంటీర్లు ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు వారధిలా పని చేస్తున్నారని, వీరి సేవలు అమూల్యమని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు లోకనాథం, గూన మన్మధరావు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుకు క్రిస్టియన్ల వినతి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : క్రిస్టియన్ మత విశ్వాశకుల కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఎటువంటి సామాజిక భవనం అందుబాటులో లేదని, పేద క్రిస్టియన్లు ఖర్చులు భరించి వివాహాది శుభకార్యాక్రమాలు నిర్వహించుకోవడం కష్ట తరంగా ఉందని స్థానిక క్రిస్టియన్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. వై.సి.పి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి కళ్యాణ మండపం నిర్మాణం జరుపు కునేందుకు అవసరమైన సుమారు ఐదు నుండి ఏడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కోరుతు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ పరిశీలిస్తామని తెలిపారు.

నేడే ఎస్సీ వర్గీకరణ మహాసభ



విశాలాంధ్ర-హిరమండలం: మందకృష్ణ మాదిగ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 28వ తేదిన జరగనున్నటువంటి మహాసభను జయప్రదం చేయవలసిందిగా పాతపట్నం నియోజకవర్గం హిరమండలం, మండల కేంద్రంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా జరగనున్నటువంటి మహాసభను జయప్రదం చేయవలసిందిగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ లోపింది కృష్ణ మాదిగ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ లోపింటి తేజ మాదిగ, ఎం ఇ ఎఫ్ జాతి నాయకులు కృష్ణ మాస్టారు, రాష్ట్ర నాయకులు కుర్మాన సుదర్శన్ రావు, జిల్లా ట్రెజరర్ గణపతి రావు మాస్టారు, హిరమండలం ఎం ఈ ఎఫ్ నాయకులు పొట్నూరు సంపత్ కుమార్ మాస్టారు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనే డెలివరీలు చెయ్యాలి

విశాలాంధ్ర-హిరమండలం : ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనే ఎక్కువగా గర్భిణీ స్త్రీలకు డెలివరీ అయ్యేలా చూడాలని హిరమండలం పిహెచ్‌సి వైద్యాధికారి డా. సి.హెచ్.సాయి గీత అన్నారు. శనివారం హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యధికారి సాయి గీత మాట్లాడుతూ అధిక ప్రమాదం ఉన్న గర్భిణీ స్త్రీల జనన ప్రణాళిక నమోదు చెయ్యాలని, ఎన్‌సిడి సర్వేలో 30 ఏళు పైబడి లక్ష్యం 22 శాతం అధిక రక్తపోటు కేసులు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ జనాభా కలిగిన ప్రతి మధుమేహం కేసులు 20 శాతం అవ్వాలని సూచించారు. పిహెచ్‌సిలో డెలివరీలు అయ్యేలా మెరుగుపరచండి. ఆర్ సిహెచ్ పోర్టల్‌లో యాంటెనాటల్, ప్రసవానంతర సదుపాయలను తదితర వాటిని కల్పించాలని, రక్తహీనత కల్గిన వారిని నమోదు చెయ్యాలని, పాఠశాలలకు వెళ్లని కౌమార బాలికల సర్వే రక్తహీనత పరీక్షలు చెయ్యలని కోరారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, తదితరులు ఉన్నారు.

మహానాడులో మనవాళ్లు



విశాలాంధ్ర-పోలాకి: తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరంలో దిగ్విజయంగా చేపట్టిన మహానాడు కార్యక్రమంలో పోలాకి మండలం నుంచి ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. శనివారం, ఆదివారం జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహానాడు కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా రాజకీయ నేపథ్యం ప్రజా సమస్యలు చర్చ వంటి కార్యక్రమాలతో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఆసక్తి, ఆలోచన,ఉత్సాహంగా మహానాడు కార్యక్రమం జరుగుతున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మిరియపల్లి వెంకటప్పలనాయుడు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నాయకత్వంలో మండలం నుంచి సుమారు 16 కార్లుతో 80 మంది పాల్గొన్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ బైరి భాస్కరరావు మాజీ జెడ్పిటిసి సభ్యులు రోణంకి కృష్ణంనాయుడు మండల మహిళ అధ్యక్షురాలు లబ్బ దమయంతి మత్స్యకారుల సంఘం నాయకులు మైలపల్లి త్రినాధరావు సర్పంచ్‌లు డోల ప్రసాదరావు చిట్టి సింహాచలం లావేటి కృష్ణారావులతో పాటు తిర్లంగి విశ్వనాథం మద్దు అప్పలరాజు కరణం శ్రీనివాసరావు పూడి కూర్మారావు మండలం నుండి అనేక పంచాయతీలు ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు ప్రాధాన్యత : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జగనన్నకు చెబుదాం(స్పందన)లో వచ్చిన ఆర్జీలకు ప్రాధన్యత ఇవ్వాలని, ఆయా పిర్యాదులపై ఖచ్చితమైన సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్న కు చెబుదాం (స్పందన) ఫిర్యాదుల పరిష్కార చర్యలుపై పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, అంతే ప్రాధాన్యతతో ఫిర్యాదులు పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.ఎటువంటి ఫిర్యాదు అయిన క్షేత్రస్థాయిలో పరిశీలించిన పిదపే చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిర్యాదు అందినవెంటనే విచారణ కచ్చితంగా జరిపించాలని, విజిటింగ్ ఫొటోలు, ఎంక్వరి నివేదిక సకాలంలో నమోదు చేయాలన్నారు. ఎండార్స్మెంట్ రిపోర్ట్ బాధితులకు అందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. స్పందనలో రీఓపెన్ అయిన వాటిపై సంబంధిత పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రీఓపెన్ అయిన వాటిపై ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు తీసుకుంటున్న వివరాలు స్పష్టంగా తెలియ జేయాలని సూచించారు. మీరు తీసుకున్న చర్యలతో అర్జీదారు సంతృప్తి చెందాలని, సంతృప్తి చెందినట్లుగా ఆ వ్యక్తి నుండి స్పందన లభించాలని చెప్పారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకట రామన్ మాట్లాడుతూ ప్రతి రోజూ వెబ్ సైట్ నందు వచ్చే ఆర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆర్జీలను పరిష్కరించకపోవడం లేదా మీరిచ్చిన సమాధానంతో అర్జీదారులు సంతృప్తికానందునే ఆర్జీలు రీఓపెన్ అవుతాయన్న తెలిపారు. ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని, అలాగే సక్రమ మైన సమాధానం ఇవ్వకుండా ఫైలును ముగించకూడదని, కచ్చిత మైన సమాచారంతో ఆర్జిలు ముగించాలన్నారు .స్పందన పోర్టల్ లో వివరాలు పొందుపరచడం లో పలు అంశాలపై ఆయన కొన్ని సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ టిపి విఠలేశ్వర్, డిఎస్పీలు డి.బాల చంద్ర రెడ్డి, వై. శృతి, జి.నాగేశ్వర రెడ్డి, ఎస్ వాసుదేవ్,ఎస్. బాల రాజు, ప్రసాద్ రావు, ఈ. ఆఫీస్ జిల్లా మనేజెర్ ఇంద్రశేకర్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్స్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం

- నార్కోటిక్ డ్రగ్స్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలి
- జిల్లా ఎస్పీ జి. ఆర్. రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: పెండింగు లో ఉన్న నార్కోటిక్ డ్రగ్స్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని, కేసులను త్వరితగతిన పరిష్కారంచాలని, ఆస్తి నేరాలు నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ జి. ఆర్. రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన నేరాలపై, గ్రేవ్ కేసులు,నార్కోటిక్ డ్రగ్స్ కేసులు, మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు, ఆస్తి నేరాలపై పోలీస్ స్టేషన్స్ వారీగా సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గంజాయి అక్రమరవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, నిరంతరం క్షుణ్ణంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు,టెంపుల్ నేరాలు, చైన్ స్నాచింగ్స్ నివారణకు గస్తీలను పటిష్టంగా అమలు పరచాలని, ఎక్కువగా నేరాలను జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పేర్కొ న్నారు. రాత్రి గస్తీలను ముమ్మరంగా అమలుపర చాలని, జ్యువెలరీ షాప్స్, దుకాణ సముదాయాలు, శివారు ప్రాంతాల్లో, నివాస సముదాయంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు అతిక్రమంచిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు వాహన చోదకులు హెల్మెట్ ధరించే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మైనర్, మహిళలు, వృద్ధులు మిస్సింగ్ కేసులకు సంబంధించి వివిధరకాల కోణాల్లో దర్యాప్తు చేయాలని సూచిం చారు. అదే విధంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మిస్సింగ్ కేసులు చేదన,పెండింగ్ కేసులు పరిష్కారం, కేసులు రాజీలు, ఎం. వి.జరిమానాలు వంటి అంశాలలో ప్రతిభ కనబరిచిన రెండవ పట్టణ సీఐ శ్రీనివాసరావు, కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు వివిధ పోలీసు స్టేషన్లు ఎస్సైలు ఎచ్చెర్ల ఎస్ఐ సత్యనారాయణ, ఒకటవ పట్టణ ఎస్ఐ బి.గణేష్, కొత్తూరు ఎస్ఐ గోవిందరావు, ఆమదాలవలస ఎస్ఐ కృష్ణ,శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ కుమార్,బారువ ఎస్ ఐ బి.సత్యనారాయణ, టెక్కలి ఎస్ఐ ఎల్ రామకృష్ణ,జె ఆర్ పురం ఎస్ఐ రాజేష్,నందిగామ ఎస్ఐ అహమాద్ ఆలీ, అనువారికి జిల్లా ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు.

శారీరక దివ్యాంగులకు అండగా వైసీపీ

జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్.

విశాలాంధ్ర-కవిటి : శారీరక దివ్యంగులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లవేళలా నిలుస్తుందని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని బల్లిపుట్టుగ జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ నివాసం వద్ద ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ద్వారా సరఫరా కాబడుచున్న రిట్రోఫిటేడ్ మూడు చక్రముల మోటరైజ్డ్ వాహనములను పిరియా విజయ సాయిరాజ్ చేతులు మీదుగా అందజేసారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంకు సంబందించిన 10 మందికి అర్హత గల శరీరక దివ్యాంగుల వాహనములను12 లక్షల విలువ గల 10 రిట్రోఫిటేడ్ మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనములను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం విభిన్నప్రభిబావంతులు సహాయ సంచాలకులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని కే కవిత, రిట్రోఫిటేడ్ మూడు చక్రముల మోటరైజ్డ్ వాహనముల లబ్దిదారులు పాల్గొన్నారు.

అరుణాచలంలో గిరి ప్రదక్షణ ప్రత్యేక బస్సు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జూన్ 4వ తేది పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణ మహోత్సవాలకు శ్రీకాకుళం నుండి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేయడమైనదని శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 2వ తేది మధ్యాహ్నం 12:00 గంటలకు బస్సు శ్రీకాకుళం బస్ స్టేషన్ నుండి బయలుదేరి 3న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కంచి దర్శించుకుని అదే రోజు రాత్రి అక్కడ నుండి బయలుదేరి 4వ తేది ఉదయం అరుణాచలం చేరుతుందని అన్నారు. అరుణాచల గిరిప్రదక్షిణ మరియు దర్శనం అనంతరం సాయంత్రం బయలుదేరి 5వ తేది సాయంత్రానికి శ్రీకాకుళం చేరుతుందని తెలిపారు. మనిషి ఒకరికి టికెట్ ధర 4,500లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్లు కావలసినవారు శ్రీకాకుళం బస్ స్టేషన్ లో గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.కాం) ద్వారా కొనుగోలు చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 7382921647, 7601038583. సంప్రదించాలని కోరారు.

బలవన్మరణాల నివారణకు కృషి

విశాలాంధ్ర-పొందూరు: బలవన్మరణాలు లేని నవభారత నిర్మాణానికి సైకాలజిస్టులు కృషి చేయాలని ప్రముఖ రచయిత,సీనియర్ స్కూల్ అసిస్టెంట్ బొడ్డేపల్లి భూపతిరావు(పొందూరు) కోరారు. శుక్ర,శనివారాల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(గుంటూరు)లో వర్సిటీ సైకాలజీ విభాగం, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త సారధ్యంలో నిర్వహించిన కార్యశాలలో భూపతిరావు పాల్గొని మార్గదర్శనం చేశారు. యువత, విద్యార్థి వర్గాల్లో ఆత్మహత్యలను నివారించేందుకు వారిలో ఆత్మస్థయిర్యం కల్పించాలన్నారు. స్పందన పక్షాన శ్రీకాకుళం జిల్లాలో విద్యార్థులను,యువతను జాగృతం చేసేందుకు భూపతిరావుకు బాధ్యతలను అప్పగిస్తున్నట్టు స్పందన చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజశేఖర్, రిసోర్స్ పర్సన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బాలికలకు ఉన్నత విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహి స్తుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వజ్రపుకొత్తూరు బాలికల జూనియర్ కళాశాల (క్లస్ 2) ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా అన్నారు. మండలంలో గల నువ్వలరేవు, మంచినీళ్ళపేట, హుకుంపేట గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయ బృందంతో కలిసి పర్యటించి బాలికలకు, వారి తల్లిదండ్రులకు ఉన్నత విద్య పట్ల అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో ప్రతిభ గల అద్యాపకులతో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. తమ కళాశాలలో ఇంటర్ మీడియట్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ధరఖాస్తులను అహ్వానిస్తున్నట్లు తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీధర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు రమణ మూర్తి, చిన్నబాబు. తిరుపతిరావు చక్రధర్, ఈశ్వర్, సురేష్, తారక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

30 నుంచి శ్రీ ముఖలింగేశ్వర వార్షిక కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-జలుమూరు: మండలం శ్రీముఖలింగంలో శ్రీముఖ లింగేశ్వర క్షేత్రంలో వారాహి సహిత శ్రీ ముఖలింగేశ్వరు నికి మే 30 నుంచి జూన్ 4వరకు వార్షిక కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చ కులు రాజశేఖర్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాల న్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామివారి కల్యాణ మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు రావాలని కోరారు.

ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించిన ఉత్సవ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-పాతపట్నం : నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు, పాతపట్నం గ్రామదేవత శ్రీనీలమణిదుర్గ అమ్మవారి సప్తవర్ష ఘట మహోత్సవాల్లో (పెద్ద పండుగలు) భాగంగా, నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి పాతపట్నం గ్రామంలోని కాపువీధి నందు ఉన్న అమ్మవారిని దర్శించు కున్నారు. తరువాత ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కోలాటం నృత్య ప్రదర్శనను తిలకించారు. అనంతరం భక్తులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రసాదమును పంపిణీ చేశారు.

నేటి నుంచి గ్రామదేవత ఉత్సవాలు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలంలో పెద్దబొడ్డపాడు, డోకులపాడు గ్రామాల్లో వెలసిన గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీలు తెలిపాయి. పెద్దబొడ్డపాడు గ్రామంలో కాళీమాత, గట్టుపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు, డోకుల పాడు గ్రామంలో పెద్దమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీలు తెలిపారు. ఆదివారం గ్రామాల్లోకి అమ్మవారి ఘటాలను తీసుకొని రావడం ద్వారా ఉత్సవాలు సంబరం ప్రారంభమవుతాయని తెలిపారు. డోకులపాడులో మూడు రోజులు, పెద్దబొడ్డపాడులో 5 రోజులు సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీలు తెలిపాయి.